రికార్డు ర్యాలీకి బ్రేక్

ముంబై, సెప్టెంబర్ 13: స్టాక్ మార్కెట్ల రికార్డు ర్యాలీకి బ్రేక్‌పడింది. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో సూచీలు నష్టపోయాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 71.77 పాయింట్లు కోల్పోయి 82,890.94 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 32.40 పాయింట్లు కోల్పోయి 25,356.50 వద్ద స్థిరపడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు అత్యధికంగా 2 శాతం వరకు నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, మారుతి, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, హెచ్‌యూఎల్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టపోగా..బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, టెక్ మహీంద్రాలు లాభాల్లో ముగిశాయి. ఈ వారంలో సెన్సెక్స్ 1,707 పాయింట్లు(2.10 శాతం), నిఫ్టీ 504.35 పాయింట్లు(2 శాతం) లాభపడ్డాయి.

విమానాల్లో 1.31 కోట్ల మంది ప్రయాణం

ఆగస్టు నెలకుగాను డీజీసీఏ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: దేశీయంగా విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరుగుతున్నారు. ఆగస్టు నెలలో ఏకంగా 1.31 కోట్ల మంది ప్రయాణించారని డీజీసీఏ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన 1.24 కోట్లతో పోలిస్తే 5.7 శాతం పెరిగారని తెలిపింది. ఇదే సమయంలో విమానాలు ఆలస్యం కావడంతో 1,79,744 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పేర్కొంది. విమానాలు రద్దుకావడంతో 38,599 మందిపై ప్రభావం చూపిందని, దీంతో వీరికి విమానయాన సంస్థలు పరిహారం, ఇతర సదుపాయాల కింద రూ.1.14 కోట్లు చెల్లించాయి. అలాగే ప్రస్తుతేడాది జనవరి-ఆగస్టు మధ్యకాలంలో 10.54 కోట్ల మంది దేశీయంగా ప్రయాణించారని, వార్షిక వృద్ధిరేటు 4.82 శాతంగా ఉన్నదని పేర్కొంది. సరైన సమయంలో విమానాలు నడిపిన సంస్థల్లో ఆకాశ ఎయిర్ 71.2 శాతంతో మొదటి స్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానాల్లో విస్తారా(68.6 శాతం), ఏఐఎక్స్ కనెక్ట్(66.8 శాతం), ఇండిగో, ఎయిర్ ఇండియాలు 66 శాతంతో ఉన్నాయి. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ఢిల్లీ, ముంబై విమానాశ్రయాల్లో వచ్చిన సర్వీసుల ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.

స్విస్ ప్రకంపనలు

స్విట్జర్లాండ్ మనీ లాండరింగ్ కేసులో 2,610 కోట్ల సొమ్ము ఫ్రీజ్

అదానీ గ్రూప్ బినామీదేనన్న అనుమానాలు • ఖండించిన కంపెనీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: మొన్న స్టాక్ మార్కెట్ అక్రమాలు.. నిన్న నకిలీ సంస్థల బాగోతాలు.. నేడు మనీ లాండరింగ్ అనుమానాలు.. అదానీ గ్రూప్‌పై వస్తున్న వరుస ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. దేశ, విదేశాల్లో వెలుగుచూస్తున్న అవినీతి కేసుల్లో అదానీ ఆనవాళ్లు కనిపిస్తుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. తాజాగా స్విట్జర్లాండ్‌లో మనీ లాండరింగ్ కేసు విచారణలో భాగంగా వివిధ స్విస్ బ్యాంక్ ఖాతాల్లోని ఓ తైవాన్ వ్యక్తికి చెందిన 311 మిలియన్ డాలర్ల (రూ.2,610 కోట్లు)ను అక్కడి అధికారులు ఫ్రీజ్ చేశారు. అయితే ఈ వ్యక్తి అదానీ గ్రూప్ బినామీయేనన్న అనుమానాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. మరోవైపు అదానీ గ్రూప్ వీటిని తీవ్రంగా ఖండించింది. ఏ స్విస్ కోర్టు విచారణల్లోగానీ లేదా జప్తు చేసిన ఖాతాలతోగానీ తమకు ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేసింది. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది.

ఇదీ సంగతి..

అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ తమ 'ఎక్స్' ఖాతాపై స్విట్జర్లాండ్ మీడియా సంస్థ 'గోతమ్ సిటీ' కొత్తగా విడుదల చేసిన స్విస్ క్రిమినల్ రికార్డులను పోస్ట్ చేసింది. వీటిలో స్విస్ అధికారులు అదానీకి సంబంధించిన మనీ లాండరింగ్, సెక్యూరిటీస్ ఫోర్జరీ కేసు దర్యాప్తులో భాగంగా కొన్ని స్విస్ బ్యాంక్ ఖాతాల్లో 310 మిలియన్ డాలర్లకుపైగా నిధులను స్తంభింపజేశారని ఉన్నట్టు హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. ఈ సొమ్ముకు బాధ్యుడైన తైవాన్ వాసి చాంగ్ చుంగ్-లింగ్.. అదానీ కంపెనీలకు చెందిన నకిలీ సంస్థలు బీవీఐ/మారిషస్ అండ్ బెర్ముడా ఫండ్స్‌లో ఎలా పెట్టుబడులు పెట్టారో అక్కడి విచారణాధికారులు స్పష్టం చేసినట్టు కూడా హిండెన్‌బర్గ్ తమ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నది. కాబట్టి ఈ మనీ లాండరింగ్ కేసుతో అదానీకి సంబంధం ఉందని, సదరు తైవాన్ వ్యక్తి అదానీ బినామీయేనన్న అనుమానాలను వ్యక్తం చేసింది.

స్విస్ మీడియా రిపోర్టుల్లో..

'జెనీవా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఈ అక్రమాలపై దర్యాప్తు చేసింది. గత మూడేండ్లకుపైగా ఐదు స్విస్ బ్యాంకుల్లో బిలియనీర్ గౌతమ్ అదానీకి చెందినవాడిగా భావిస్తున్న వ్యక్తికున్న 310 మిలియన్ డాలర్లకు పైగా సొమ్మును అధికారులు ఫ్రీజ్ చేశారని ఫెడరల్ క్రిమినల్ కోర్టు వెల్లడించింది' అంటూ స్విస్ మీడియా గోతమ్ సిటీ తమ రిపోర్టుల్లో తెలియజేసింది. అంతేగాక తమ దర్యాప్తులో చాంగ్ చుంగ్-లింగ్ అసలు కంపెనీల యజమాని కాదని తేలిందని స్విస్ అధికారులు పేర్కొన్నట్టు వివరించింది. మొత్తంగా ఈ ఏడాది ఆగస్టు 9న ఇచ్చిన ఆదేశాల్లో అదానీ గ్రూప్.. మనీ లాండరింగ్ ఇతరత్రా అక్రమ కార్యకలాపాల్లో భాగమైనట్టు కోర్టు అనుమానాలు వ్యక్తం చేసిందంటూ ఈ నెల 10న విడుదల చేసిన రిపోర్టులో గోతమ్ సిటీ తేల్చిచెప్పింది. అంతేగాక అదానీ గ్రూప్ ద్వారా పెద్ద మొత్తంలో పొందిన సొమ్మును చుంగ్-లింగ్ అక్రమ మార్గాల్లో పెట్టుబడులు పెట్టారన్నది.

అదానీ వాదన ఇదీ..

ఈ వ్యవహారం విచారణ సందర్భంగా స్విస్ కోర్టు తమ కంపెనీ పేరును ప్రస్తావించలేదని, తమ నుంచి ఏ రకమైన వివరణనూ కోరలేదని అదానీ గ్రూప్ అంటున్నది. విదేశాల్లో ఉన్న తమ కంపెనీలన్నీ పారదర్శకంగా ఏర్పాటైనవేనని, అక్కడి చట్టాలు, నిబంధనలకు లోబడే పనిచేస్తున్నాయని చెప్పుకొచ్చింది. 'ఈ ఆరోపణలన్నీ అసంబద్ధమైనవి, అహేతుకమైనవి. ఇదంతా మా గ్రూప్ ప్రతిష్ఠను, మార్కెట్ వాల్యూను దెబ్బతీయడానికి చేస్తున్న మరో కుట్రని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు' అని అదానీ గ్రూప్ ఈ వ్యవహారంపై స్పందించింది. మరోవైపు హిండెన్‌బర్గ్-అదానీ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపుతున్నది. దీనిపై సుప్రీం కోర్టు లోతుగా విచారణ చేయాలని కాంగ్రెస్‌సహా ఇతర ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి గతంలో సెబీ విచారణ చేసి ఏమీ తేల్చకపోవడం, దానీ చీఫ్ మాధవీ పురీ బచ్ పైనా అవినీతి ఆరోపణలు వస్తుండటం, ప్రధాని మోదీకి అదానీకి సంబంధాలు సైతం వివాదాస్పదమవుతున్న నేపథ్యంలో ఈ అంశం మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

చాలా పెద్ద కథే..

గత ఏడాది జనవరిలో అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అక్రమాలపై హిండెబర్గ్ రిసెర్చ్ విడుదల చేసిన సంచలన రిపోర్టులోనే చాంగ్ చుంగ్-లింగ్ పేరుండటం గమనార్హం. అక్రమ నిధులతో మారిషస్‌లో ఏర్పాటైన గ్రోమోర్ అనే సంస్థకు ఇతను డైరెక్టర్‌గా ఉన్నాడని, విదేశీ ఫండ్స్ ద్వారా అదానీ స్టాక్స్ క్రయవిక్రయాల లావాదేవీలను జరుపుతాడని హిండెన్‌బర్గ్ చెప్తున్నది. అదానీ పవర్‌తో జరిగిన స్టాక్ విలీనం ద్వారా రాత్రికిరాత్రే గ్రోమోర్‌కు 423 మిలియన్ డాలర్ల ప్రయోజనం ఒనగూరినట్టు కూడా గతంలోనే హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసింది. ఇక చుంగ్-లింగ్ కుమారుడు చాంగ్ చీన్-టింగ్.. పీఎంసీ ప్రాజెక్ట్స్ (ఇండియా) యజమానుల్లో ఒకరన్నది. భారతీయ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. అదానీ గ్లోబల్, గ్రోమోర్‌తోపాటు ఈ పీఎంసీ ప్రాజెక్ట్స్‌పైనా విచారణ చేయడం గమనార్హం. నాటి హిండెన్‌బర్గ్ రిపోర్టు దెబ్బకు అదానీ గ్రూప్‌లోని సంస్థల మార్కెట్ విలువ ఏకంగా 150 బిలియన్ డాలర్లు కుప్పకూలిన సంగతి విదితమే.

భగ్గుమన్న బంగారం

ఒకేరోజు 1,200 పెరిగిన తులం ధర • రెండు నెలల గరిష్ఠ స్థాయికి విలువ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉండటంతో బంగారం ధరలు రెండు నెలల గరిష్ఠ స్థాయిని తాకాయి. శుక్రవారం ఒకేరోజు దేశ రాజధాని ఢిల్లీలో తులం పుత్తడి ధర రూ.1,200 ఎగబాకి రూ.75,550 పలికింది. దీంతో గత రెండు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. అంతకుముందు ఇది రూ.74,350 వద్ద ఉన్నది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,300 ఎగబాకి రూ.74,450కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.1,200 అందుకొని రూ.68,250 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,599.70 డాలర్లు పలుకగా, వెండి 30.47 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

వెండి పరుగులు

బంగారంతోపాటు వెండి మరింత పరుగులు పెట్టింది. గత నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి శుక్రవారం మరో అడుగుముందుకేసింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 ఎగబాకి రూ.89 వేలకు చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గతంలో ఇది రూ. 87 వేలుగా ఉన్నది. గత నాలుగు రోజుల్లో వెండి ఏకంగా రూ.5,200 పెరిగినట్లు అయింది. ఇటు హైదరాబాద్‌లో రూ.3,500 అధికమైన కిలో ధర రూ.95 వేలకు చేరుకున్నది.

ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు వల్లే

అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు మెండుగావున్నాయంటు వచ్చిన వార్తలు అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర రికార్డు స్థాయికి చేరుకున్నది. ఈ నెల 18న తన సమీక్షను ప్రకటించనున్నది. దీనికి తోడు దేశీయంగా పండుగ, పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో ధరలు భారీగా పుంజుకున్నాయని ఓ వర్తకుడు వెల్లడించారు.

అన్ని ఆరోపణలూ అవాస్తవాలే

- **సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: తనపై వచ్చిన ఆరోపణలన్నీ తప్పుడువేనని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ అన్నారు. అదానీ గ్రూప్ అక్రమాల్లో బచ్ దంపతులకూ భాగస్వామ్యం ఉందంటూ అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సెబీ చీఫ్‌పై వరుస విమర్శలు వ్యక్తమవగా.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సైతం అవినీతి ఆరోపణలు గుప్పించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం భర్త ధవల్ బచ్‌తో కలిసి మాధవీ పురీ బచ్ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇందులో మహీంద్రా గ్రూప్, డాక్టర్ రెడ్డీస్ మరికొన్ని కార్పొరేట్ సంస్థల నుంచి చెల్లింపులు జరిగాయన్నదానిపైనా స్పష్టత ఇచ్చారు. ఏ కంపెనీతో కూడా మార్గదర్శకాలు, నిబంధనలకు విరుద్ధంగా వెళ్లలేదని చెప్పారు. 2017లో సెబీ బోర్డులోకి వచ్చాక కూడా అగోరా అడ్వైజరీ, అగోరా పార్ట్‌నర్స్ నుంచి ఆర్జించారన్న ఆరోపణలపై

స్పందిస్తూ.. ఆ రెండింటికి సంబంధించిన ఏ వ్యవహారంలోనూ తలదూర్చలేదని వెల్లడించారు. సెబీలో తానున్నప్పుడు తన భర్త పనిచేసిన మహీంద్రా గ్రూప్, పిడిలైట్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అల్వరేజ్, మర్సల్, సెంబ్‌కార్ప్ వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోలేదన్నారు. ఇక తాను గతంలో పనిచేసిన ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి కాంట్రిబ్యూటరీ యాన్యుటీ స్కీం, ఇతరత్రా ఉద్యోగ ప్రయోజనాలకు సంబంధించిన చెల్లింపులనే తీసుకున్నట్టు వివరణ ఇచ్చారు.

టీ హబ్‌లో టీ-బ్రిడ్జ్ కార్యక్రమం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార అవకాశాలను అందించడానికి టీ హబ్..టీ బ్రిడ్జ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీ హబ్ కేంద్రంగా పలు రంగాల్లో ఆవిష్కరణలు చేసిన స్టార్టప్‌లకు ప్రపంచవ్యాప్తంగా సంబంధాలు ఏర్పాటు చేయడానికి టీ బ్రిడ్జి వేదికగా ఉంటుందని నిర్వహకులు తెలిపారు. శుక్రవారం టీ హబ్‌ను ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ)కు చెందిన ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా స్టార్టప్ నిర్వాహకులతో ప్రత్యేకంగా నెట్‌వర్క్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

హైదరాబాద్‌లో ప్రణామ్ హాస్పిటల్

హైదరాబాద్, సెప్టెంబర్ 13: ప్రముఖ వైద్య సేవల సంస్థ ప్రణామ్ హాస్పిట్స్...హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లలో దవాఖానాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. వీటిని ఏర్పాటు చేయడానికి మేక్ ఇన్ ఇండియా హాస్పిటల్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించడానికి ముఖ్యంగా ఇన్నోవేషన్, ఎక్సలెన్స్, మెడికల్ విభాగంలో తనదైన గుర్తింపు సాధించడానికి కృత నిశ్చయంతో ఉన్నది. ఈ సందర్భంగా ప్రణామ్ హాస్పిటల్స్ ఎండీ మనీష్ గౌర్ మాట్లాడుతూ.. మేక్ ఇన్ ఇండియా హాస్పిటల్స్‌తో కలిసి నూతన జర్నీని ప్రారంభించినట్లు, దీంతో తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదన్నారు. సరసమైన ధరలకే హెల్త్‌కేర్, మెడికల్ సర్వీసులు అందించడానికి కృత నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు.

లారస్ ప్లాంట్లో అమెరికా తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ లారస్ ల్యాబ్‌నకు చెందిన ప్లాంట్లో అమెరికా నియంత్రణ మండలి తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్‌కు సమీపంలోని శామీర్‌పేట్‌లోని జినోమ్ వ్యాలీలో కంపెనీకి ఉన్న ఏపీఐ తయారీ యూనిట్‌లో యూఎస్ఎఫ్‌డీఏ అధికారులు ఆడిట్ నిర్వహించి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని వెల్లడించింది.

బందగీ స్తూపానికి నివాళులర్పిస్తున్న సీపీఐ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

బందగీ మరణంతో ఉవ్వెత్తున కమ్యూనిస్టు ఉద్యమం

దేవరుప్పుల, సెప్టెంబర్ 13: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కామారెడ్డి గూడెంకు చెందిన వీరుడు షేక్ బందగీ రజకార్ల చేతులో వీరమరణంతోనే కమ్యూనిస్టు ఉద్యమం మరోసారి ఉవ్వెత్తున లేచిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. రైతాంగ సాయుధ పోరుకు 76 ఏండ్లు ముగిసిన నేపథ్యంలో శుక్రవారం కడవెండి దొడ్డి కొంరయ్య, కామారెడ్డి గూడెం బందగీ స్తూపం వద్ద దొడ్డి కొంరయ్యకు నివాళులర్పించి అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం, నాయకులు రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినేపల్లి వేంకటేశ్వర్‌రావు, చిన్న చంద్రన్న, రాష్ట్ర నాయకులు ఆవుల వేంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య,కొత్తపల్లి రవి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, కే రవి ఉన్నారు.

చెరువులో శిశువు మృతదేహం

లింగాలఘనపురం, సెప్టెంబర్ 13: అప్పుడే పుట్టిన శిశువు మృతదేహం మండలంలోని నెల్లుట్ల చెరువు సమీపంలో శుక్రవారం లభ్యమైంది. గుర్తుతెలియని వ్యక్తులు శిశువు మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి పడేసి పోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక నిమజ్జన ర్యాలీలో డీజేలు నిషిద్ధం

దేవరుప్పుల, సెప్టెంబర్ 13: వినాయక నిమజ్జనం ర్యాలీ సందర్భంగా మండప నిర్వాహకులు డీజే సౌండ్ సిస్టం వాడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల డీజే ఓనర్లను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. వినాయక నిమజ్జనం ర్యాలీలో డీజే అనుమతులు లేవని, ఎవరైనా నిర్వాహకులకు డీజే ఓనర్లు కిరాయికి పెడితే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఈ విషయంలోఓనర్లు సహకరించి నిమజ్జన కార్యక్రమానికి డీజేలు ఇవ్వద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సృజన్‌కుమార్, స్థానిక పోలీసులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

'నమస్తే తెలంగాణ'కు స్పందన

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 13: కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు...ఎండుతున్న పంటలు అనే శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. శుక్రవారం పెద్ద తండా కే, మల్లంపల్లి, భీక్యా నాయక్ పెద్ద తండాల్లో విద్యుత్ అధికారులు పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేశారు. డీఈ గణేశ్, ఏడీఈ బాలగంగాధర్ తిలక్, ఏఈఈలు సుమన్, సత్తయ్య, రణధీర్‌రావు ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు కాలుతున్నాయో ఆరా తీశారు.

పెద్ద తండాలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసిన విద్యుత్ శాఖ అధికారులు

పౌష్టికాహార లోపంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- **కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**

జనగామ, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్ని గుర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ఎస్ఎన్ఎఫ్పీ కార్యనిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం ఉన్న వారికి ప్రతి 15 రోజులకోసారి సరైన పద్ధతిలో బరువులు, ఎత్తు కొలతలను తీసి ఆన్‌లైన్‌లో సరైన విధంగా నమోదు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో తల్లిదండ్రులకు చిన్నారుల స్థితిని తెలియజేయాలన్నారు. అదే విధంగా పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉన్న పిల్లల్ని ఎన్ఆర్సీకి రెఫర్ చేయాలని, చిన్నారులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు పర్యవేక్షణ చేయాలని, పౌష్టికాహార లోపం కొద్దిగా ఉన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం ప్లస్ న్యూట్రిషన్ సంబంధించిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ప్రతి సెక్టార్ సమావేశంలో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలపై ఆరా తీయాలని, వారి స్థితి వివరాల నివేదికను అందజేయాలన్నారు. సదస్సులో సీడీపీవోలు రమాదేవి, ఫ్లోరెన్స్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, జూడాలు, ఆన్‌లైన్ యాప్ ట్రైనర్ జిల్లా కో-ఆర్డినేటర్ మహేష్, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, సోమయ్య, శ్రీకాంత్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

జనగామ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రం (హబ్, స్పోక్ మోడల్)లో శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ నిర్వహణ, ల్యాబ్‌లో రక్త పరీక్షల నిర్వహణ ప్రక్రియ, రోగుల నమోదు వివరాలు, తదితర అంశాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల (జనగామ, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి) పరిధిలో ఉన్న ఆయా ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రతి రోజూ దాదాపుగా 700 వైద్య నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన శాంపిల్స్ సేకరించి, ఈ టీ-డయాగ్నస్టిక్ హబ్‌కు అందజేస్తున్నట్లు వివరించారు. రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్ తిరస్కరణకు గురి కాకుండా వంద శాతం ఫలితాలు ఇవ్వాలన్నారు. రక్త నమూనాలు సేకరించిన వ్యక్తి ఫోన్ నంబర్లను పక్కాగా రిజిస్టర్ చేయాలని, శాంపిల్స్ గల్లంతు కాకుండా పకడ్బందీగా వాటిపై నంబరింగ్ వేయాలని, సిబ్బందికి రోస్టర్ నంబర్లు కేటాయించాలని, బయో మెడికల్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ఎప్పటికప్పుడు ల్యాబ్‌లో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ గోపాల్ రావు, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ప్యాథాలజిస్ట్ లు, బయోకెమిస్ట్‌లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

నెల్లుట్ల చెరువును పరిశీలించిన కలెక్టర్

లింగాలఘనపురం: మండలంలోని నెల్లుట్ల చెరువును కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం పరిశీలించారు. జనగామ పట్టణంతో పాటు మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ప్రతి ఏటా నెల్లుట్ల చెరువులోనే నిమజ్జనం చేస్తారు. ఈ నేపద్యంలో కలెక్టర్ చెరువును పరిశీలించి నిమజ్జన ఏర్పాట్లపై తగు సలహాలను, సూచనలను అధికారులకు అందించారు. కార్యక్రమంలో విద్యుత్ సీఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఈ శంకరయ్య, ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జనగామ రూరల్, సెప్టెంబర్13: విద్యార్థులు పట్టుదలతో చదివి తమ గ్రాడ్యుయేషన్ పట్టాలను సాధించడం చాలా సంతోషమని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుది అన్నారు. శుక్రవారం మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 2019-2023 సంవత్సరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాల పంపిణీని మాజీ డైరెక్టర్ అగస్టీన్ రెడ్డితో కలిసి అందజేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో అత్యుత్తమ అవుట్ గోయింగ్ విద్యార్థి జైవీర్ రెడ్డిని ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్ రెడ్డి, కోఆర్డినేటర్లు రావు, ఆజం, స్వప్న, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక సన్నిధిలో జన్మదిన వేడుకలు

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 13 : చిన్నారి పాప జన్మదిన వేడుకలను వినాయక సన్నిధిలో నిర్వహించిన ఘటన మండలంలోని ఇప్పగూడంలో చోటు చేసుకుంది. ఇప్పగూడం గ్రామానికి చెందిన కొండెం రాజారెడ్డి, సంధ్య దంపతుల కూతురు నిర్విజ్ఞ 6వ జన్మదిన వేడుకలను గురువారం రాత్రి గణేశ్ మండపంలో కేక్ కట్ చేశారు. అనంతరం తమ పాప పుట్టి రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

గ్రామ పంచాయతీల్లో డ్రైడే..

జనగామ, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లింగాలఘనపురం మండలం పటేల్ గూడెం గ్రామ పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రం, రఘునాథపల్లి మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా మురుగు కాల్వల శుభ్రత, కాల్వల చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించడం, రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడం, ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించుట, గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి నీటి తొట్టెలలోని నీటి నిల్వలను శుభ్ర పరచుట, ఆశ కార్యకర్తలతో ఇంటి సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, నీటి ట్యాంకులను శుభ్ర పరిచి వాటిలో ఆయిల్ బాల్స్ వేయించడం, నీటి ట్యాంకుల ట్యాపుల వద్ద పేరుకుపోయిన నాచును శుభ్ర పరచడం, ఊర్లలో ఫాగింగ్, బ్లీచింగ్ చేయించుట, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్, తదితర విష జ్వరాలు ప్రబలకుండా ఇళ్లను, ఇంటి పరిసరాలను శుభ్ర పరచడం, తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త వాహనాల్లో వేయుట, వంటి పనులను చేపట్టారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం

దేవరుప్పుల, సెప్టెంబర్ 13: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి పూజ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జ్వరం, దగ్గు ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు ఆమె అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంమూర్తి, రామకృష్ణ, ఏఎన్ఎం వసంత, ఆశ కార్యకర్తలు జ్యోతి, శైలజ ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామాల్లో ఓటరు జాబితా ప్రదర్శన

బచ్చన్నపేట, సెప్టెంబర్ 13: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పంచాయతీ కార్యాలయాల వద్ద వార్డుల వారిగా జాబితాను ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని వారు ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లికార్జున్ తమ్మడపల్లి గ్రామ ప్రత్యేకాధికారి గ్రామంలో జాబితా ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకే కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండే విధంగా జాబితా రూపొందించామని, అందులో ఏమన్నా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియ జెప్పాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు అనిల్‌రాజ్, రాజశేఖర్, కవిత, రుబీనా, సౌజన్య, రూపాచైతన్య, రాధాక్రిష్ణ, వెంకట్, భాను, రమేశ్‌రెడ్డి, దేవీప్రసాద్, సతీశ్‌రెడ్డి, మధు, కరుణాకర్, నరేశ్, భరత్, ప్రశాంత్‌ఆచార్య, భాస్కర్, చారీ, కారోబార్లు ప్రభాకర్, శ్రీనివాస్, మురళి, రాజు, నాగయ్య, అన్వర్, సురేశ్, శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్, లలిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పుస్తకాల పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 13 : గణితంపై విద్యార్థులకు భయం పోగొట్టి, ఇష్టం పెరిగేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న సూచించారు. శుక్రవారం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన తొలిమెట్టు కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండకు చెందిన గణిత ఉపాధ్యాయుడు సుతారి మురళీదర్ 6, 7 తరగతి విద్యార్థులకు గణితంలో సులభంగా అభ్యసన చేసేలా స్వయంగా రచించిన ఎన్‌రిచ్‌మెంట్ ఇన్ బెసిక్ ఆపరేషన్స్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అనే పుస్తకాలను ఆర్డీవో చేతుల మీదుగా 100 మంది విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సబ్జెక్ట్‌ను ఇష్టంతో చదివితే పట్టు సాధించడం కష్టమైన పని కాదన్నారు. విద్యార్థులకు గణిత పుస్తకాలను అందించి న మురళీధర్‌ను ఆర్డీవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సంపత్ అభినందించారు. ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీధర్, శ్రీకాంత్, శైలజ, చక్రధర్, ఝాన్సీ, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పుస్తకాలను అందిస్తున్న ఆర్డీవో వెంకన్న